క్లుప్తంగా

బీఆర్ఎస్‌కు ప్రజల ఆదరణ



ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు భిక్షపతి

నర్సాపూర్: బీఆర్ఎస్‌కు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తుందని ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు పంబాల భిక్షపతి చెప్పారు. బీఆర్ఎస్ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి మద్దతుగా మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్‌తో పాటు పట్టణంలో తమ పార్టీకి చెందిన ఆయా వార్డుల కౌన్సిలర్లు, పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం చేస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. కాగా అన్ని వార్డుల్లో ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తుందని తెలిపారు. పట్టణంలో తమ పార్టీకి మెజార్టీ ఖాయమని భిక్షపతి ధీమా వ్యక్తం చేశారు.

ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తి



ఓటరు స్లిప్పులు అందిస్తున్న సిబ్బంది

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలో ఓటరు స్లిప్పుల పంపిణీ కార్యక్రమాన్ని బీఎల్‌ఓలు పూర్తి చేశారు. ఈ నెల 13న పోలింగ్‌కు సంబంధించి ఓటర్లకు, ఓటర్ స్లిప్పులు అందజేశారు. మండల వ్యాప్తంగా 33 వేల 732 మంది ఓటర్లు ఉన్నారని ఇందులో 327 మంది ఓటర్లు ఇతర చోట్లకు మారారని అన్నారు. పలువురు చనిపోయారని, మిగతా రందరికీ సిబ్బంది స్లిప్పులు అందజేశామని తహసీల్దార్ శ్రీనివాస్‌చారి అన్నారు. ఓటింగ్ రోజున ఓటరు వారికి సంబంధించి 14 రకాల ఏదైన గుర్తుంపు కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు.

ఘనంగా కార్ల్ మార్క్స్ జయంతి



కార్ల్ మార్క్స్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మెదక్ కలెక్టరేట్: ప్రపంచ తత్వవేత్త కార్ల్ మార్క్స్ జయంతిని ఆదివారం పట్టణంలోని కేవలం కిషన్ భవన్‌లో సీపీఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బాలకృష్ణ, పార్టీ జిల్లా కార్యదర్శి మల్లేశం మాట్లాడుతూ.. దోపిడీకి వ్యతిరేకంగా రాయడమే కార్ల్ మార్క్స్‌కు నిజమైన నివాళి అర్పించడమని పేర్కొన్నారు. శ్రమదోపిడీకి వ్యతిరేకంగా పోరాటమే పార్టీ సిద్ధాంతమని తెలిపారు. పట్టణంలో అందుకు కేవల్ కిషన్ భవనాన్ని ఏర్పాటు చేసి అనేక సామాజిక ఉద్యమాలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బసవరాజు, మల్లేశం, నర్సమ్మ, నాయకులు అజయ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని బూరుగడ్డ, మర్రిచెట్టుతండా, వీరమాన్‌సింగ్‌తండా, పాంపల్లి తదితర గ్రామాల్లో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీతోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని, ఎంపీగా అభ్యర్థి రఘునందన్‌రావును గెలిపించాలని ప్రచారం నిర్వహించారు.

దాతల సాయం గొప్పది



దాతను సన్మానిస్తున్న గోశాల నిర్వాహకులు

శివ్వంపేట(నర్సాపూర్): అనాథ ఆశ్రమంలోని మానసిక దివ్యాంగులకు దాతలు సహాయం చేయడం గొప్ప విషయమని మగ్దుంపూర్ అనాథ ఆశ్రమ నిర్వాహకుడు సజీవ్ వర్గీస్ అన్నారు. పిల్లుట్ల గ్రామానికి చెందిన బండారు గంగాధర్ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం ఆశ్రమంలో అన్నదానం చేశారు. దొంతిలోని గోశాలకు పశుగ్రాసం అందజేశారు. గోశాలలో పశుగ్రాసం కొరత ఉందని దాతలు ముందుకు రావాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుహాసినిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, సుదర్శన్‌గౌడ్, గణేశ్‌గౌడ్, గణేశ్ ఉన్నారు.

ఉపాధి పనుల్లో కౌడిపల్లి టాప్

- గిట్టుబాటు కూలి కల్పించడంలో జిల్లాలో మొదటి స్థానం
- వేసవి సందర్భంగా రూ.300లకు పెంచిన ప్రభుత్వం



రాజిపేటలోని చెరువులో పూడిక తీస్తున్న కూలీలు

కౌడిపల్లి(నర్సాపూర్): ఉపాధిహామీ పనులు కల్పించడంలో కౌడిపల్లి మండలం టాప్‌లో ఉంది. గ్రామాల్లో స్థానికంగా పనులు కల్పించి వలసలను నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎంఎన్ఆర్ఈజీఎస్ ఉపాధిహామీ పథకాన్ని ప్రారంభించింది. దీంతో కూలీలకు పనులు లభిస్తున్నాయి.

వేసవిలో వ్యవసాయ పనులు ఉండవు. ఉపాధిహామీ పనులకు వెళ్లి గిట్టుబాటు కూలీతో కూలీలు ఉపాధి పొందుతున్నారు. ఉపాధిహామీ పథకంలో గ్రామాల్లో వివిధ పనులను ఎంపిక చేసి, కూలీలకు ప్రభుత్వం పనులు కల్పిస్తుంది. కౌడిపల్లి మండలంలో 6,562 జాబ్‌కార్డులు ఉన్నాయి. ఇందులో 12,725 మంది కూలీలు ఉన్నారు. ప్రస్తుతం వివిధ గ్రామాల్లో ప్రతీరోజు 5వేల మంది వరకు పనులు చేస్తున్నారు. ఇంకా కూలీల సంఖ్యను పెంచేందుకు గ్రామాల్లో ఎంపీడీఓ, ఏపీఓ, ఈసీ, పంచాయతీ కార్యదర్శులు, ఇతర ఉపాధి హామీ అధికారులు కూలీలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతీ కూలీకి పనులు కల్పిస్తూ.. కూలీల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తున్నారు.

ప్రతీరోజు 5వేల మంది

ఉపాధిహామీ పథకంలో కూలీలకు పనులు కల్పించడంలో జిల్లాలో కౌడిపల్లి మండలం రెండో స్థానంలో ఉండగా.. గిట్టుబాటు కూలీ కల్పించడంలో మాత్రం మొదటి స్థానంలో ఉంది. 5వేల మంది కూలీలు పనులు చేస్తుండగా.. ప్రతీరోజు కూలీలు సుమారుగా రూ. 240 నుంచి రూ.280 వరకు కూలి గిట్టుబాటు అవుతుంది. ప్రభుత్వం మాత్రం వేసవి సందర్భంగా రోజు కూలి రూ. 300లకు పెంచింది. ఫీల్డ్ అసిస్టెంట్, మేట్ ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేయాలని చెప్తున్నారు.

ఉపాధిహామీలో చేపట్టే పనులు

ఉపాధిహామీ పథకంలో స్థానికంగా పనులు కల్పించడంతో పాటు ప్రజలకు, ప్రకృతికి అవసరమైన పనులు చేపడుతున్నారు. చెరువు, కుంటల్లో పూడిక తీత, అటవీభూముల్లో వర్షం నీరు నిలిచేందుకు కందకాలు తవ్వడం, పంట పొలాలతో పాటు గ్రామస్తుల అవసరం మేరకు ప్రజలు సూచన ప్రకారం మట్టి రోడ్డు వేయడం, హరితహారం మొక్కలకు నీళ్లు పెట్టడం, వన నర్సరీల ఏర్పాటు, ఫంట కుంటల తవ్వకం, భూమి చదును చేయడం, పొలం గట్టుపై టేకు ఇతర మొక్కలు నాటడం తదితర పనులు కల్పిస్తున్నారు. ఇందులో ఎక్కువగా పూడిక మట్టి తీయడం, ఫార్మేషన్ రోడ్డువేయడం పనులు చేస్తున్నారు. కూలీలు పనులు చేసేచోట మంచి నీటి సౌకర్యం, ప్రథమ చికిత్స కిట్ ఏర్పాటు చేస్తున్నారు. నీడ సౌకర్యం లేకపోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. మంచినీటి కోసం ఒక్కో కూలీలకు రూ 2.50 చొప్పున గ్రామ పంచాయతీలో జమ అవుతుంది. దీంతో గ్రామ పంచాయతీ నీటి సౌకర్యం కల్పిస్తుంది. కూలీలు సైతం ఉదయం పనులకు వెళ్లి పదిగంటలలోపు తిరిగి వస్తున్నారు.

ఆన్‌లైన్‌లో అటెండెన్స్..

కూలీలు చేసే పనులకు ఫీల్డ్ అసిస్టెంట్లు లేదా మేట్ పని జరిగే ప్రదేశంలో కూలీల హాజరును మొబైల్ ఫోన్‌ద్వారా ఉపాధిహామీ ప్రత్యేక యాప్ ద్వారా కూలీల అటెండెన్స్ వేస్తున్నారు. జియో ట్యాగింగ్‌తో కచ్చితంగా పనిజరిగే ప్రదేశానికి వెళ్లి అటెండెన్స్ వేస్తున్నారు. గత ఏడాది ఉపాధిహామీ పథకం ద్వారా మండలంలో కూలీలకు 2.95లక్షల పనిదినాలు కల్పించారు. దీని కోసం కూలీలకు రూ 8.58కోట్లు చెల్లించారు. 395 కుటుంబాలకు వంద రోజులు పని కల్పించారు.

పని దొరుకుతుంది



గ్రామంలో ఉపాధి హామీ పథకంలో కూలీలకు పనులు కలి ్పస్తున్నారు. దీంతో ఇక్కడే పనులు చేస్తున్నాం. ఉదయం వెళ్లి ఎండ కాకముందు పనిపూర్తి చేసుకొని తిరిగి వస్తున్నాం. మంచినీళ్లు ఏర్పాటు చేస్తున్నారు.

– గంగమ్మ, భుజిరంపేట

కూలీల సంఖ్య పెంచుతాం



ఉపాధిహామి పథకంలో కూలీలకు పనులు కల్పించడంలో మండలం రెండో స్థానంలో ఉంది. కాగా గిట్టుబాటు కూలీ కల్పించడంలో మాత్రం మొదటి స్థానంలో ఉన్నాం. ప్రస్తుతం 5వేల మంది కూలీలు పనులు చేస్తున్నారు. కూలీల సంఖ్యను పెంచేందుకు గ్రామాలు, తండాల్లో అవగాహన కల్పిస్తున్నాం.

– పుణ్యదాస్, ఏపీఓ, కౌడిపల్లి

రాష్ట్రంలో అసమర్థ పాలన

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం అసమర్థ పాలన కొనసాగుతుందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి విమర్శించారు. మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ఆదివారం వెల్దుర్తి మండలంలోని పలు గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేపట్టి ప్రచారం నిర్వహించారు. ఆరు గ్యారంటీల పేరుతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలం చెందిందన్నారు. అబద్ధాల కాంగ్రెస్‌కు ఎంపీ ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలు ఒక్కటేనన్నారు. ఒకటి మతం పేరిట ప్రజలను రెచ్చగొట్టాలని చూస్తే రెండోది తప్పుడు ప్రకటనలతో సీట్లు గెలవడానికి ప్రయత్నిస్తుందని విమర్శించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఎక్కడ చూసినా.. సీఎం కేసీఆర్ హయాంలోనే రాష్ట్రం పాడి, పంటలతో కలకలలాడిందన్నారు. ప్రచారంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, జెడ్పీటీసీ రమేశ్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ అనంతరెడ్డి, నాయకులు తోట నర్సింలు, మల్లేశంగౌడ్, నర్సింలు, సత్యనారాయణగౌడ్, మాజీ సర్పంచ్‌లు వినోద, లత, విజయ, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మరోసారి అవకాశం ఇవ్వండి

రేగోడ్‌లో కార్నర్ మీటింగ్‌లో ఎంపీ బీబీ పాటిల్



మాట్లాడుతున్న ఎంపీ బీబీ పాటిల్

రేగోడ్(మెదక్): తనను భారీ మెజార్టీతో గెలిపించి, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడిగా మరోసారి అవకాశం ఇవ్వాలని ఎంపీ బీబీ పాటిల్ ప్రజలను కోరారు. మండల కేంద్రం రేగోడ్‌లో ఆదివారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పలువురు బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలు, పట్టణాల్లో బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. జుక్కల్ మాజీ ఎమ్మెల్యే గంగారాం మాట్లాడుతూ.. బీబీ పాటిల్ ప్రజలకు ఎంతో సేవ చేస్తాడని తెలిపారు.

మళ్లీ ప్రధానిగా మోదీని గెలిపించాలి



నార్సింగిలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): మరోసారి బీజేపీని గెలిపించి ప్రధానిగా నరేంద్రమోదీని ఎన్నుకోవాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిలర్, మెదక్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండన్ సుభాష్‌చంద్రగౌడ్ కోరారు. మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. ప్రజలు బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రాజు, పట్టణాధ్యక్షుడు రాజు, మంజుల, శ్రీను, స్వామి, మధు, బాబు తదితరులు పాల్గొన్నారు.

నార్సింగిలో బీజేపీ ప్రచారం..

చిన్నశంకరంపేట(మెదక్): బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా పార్లమెంట్ కో కన్వీనర్ సంతోష్ కుమార్ గుప్తా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆదివారం నార్సింగి కార్నర్ మీటింగ్‌లో పాల్గొని ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నియోజవర్గ కన్వీనర్ గోవింద్, మండలాధ్యక్షుడు బాల్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు చంద్రశేఖర్, లింగారెడ్డి, గురుపాదం, నరేష్, అఖిల్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీకి మద్దతుగా ఓటేయండి



వసరం తండాలో బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం

కొల్చారం(నర్సాపూర్): పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి మద్దతుగా ఓటు వేసి మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావును గెలిపించాలని రాష్ట్ర పార్టీ నాయకులు అభినవ సర్దార్, విజయ్ యాదవ్ కోరారు. ఆదివారం మండల పరిధిలో వసురాం తండా, సీతారాం తండాలో ఆ పార్టీకి చెందిన నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీకి చెందిన మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటికీ పంచుతూ రఘునందన్ రావుకు ఓటు వేయాలని కోరారు. ప్రపంచ పటంలో భారతదేశాన్ని మహోన్నత స్థానానికి తీసుకెళ్లిన మోదీ మరోసారి భారత ప్రధానిగా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ దయాకర్‌గౌడ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించండి



తిమ్మాపూర్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

ఎంపీపీ సబిత

చిన్నశంకరంపేట(మెదక్): మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపించాలని నార్సింగి ఎంపీపీ అధ్యక్షురాలు సబిత కోరారు. ఆదివారం నార్సింగి మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ను కట్టడి చేసి ఆరు గ్యారంటీల అమలుకు ఒత్తిడి పెంచాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నార్సింగి మండల అధ్యక్షుడు బాబు, పట్టణ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఉన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రామాగౌడ్ తెలిపారు. ఆదివారం తిమ్మాపూర్, కుషన్‌గడ్డతండా, వెంకట్రావ్‌పేట తదితర గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌తోనే రాష్ట్రం అభివృద్ధి చెందిందని చెప్పారు. ఈకార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ దుర్గారెడ్డి, ఎంపీటీసీ స్వప్న కిషోర్‌గౌడ్, మాజీ సర్పంచ్ లావణ్య, మాజీ ఎంపీటీసీ శంకర్‌గౌడ్, ప్రతాప్‌గౌడ్ పాల్గొన్నారు.

దళారులకు ధాన్యం విక్రయించొద్దు

పీఏసీఎస్ సీఈఓ దుర్గాగౌడ్

సాక్షి ఎఫెక్ట్..

కౌడిపల్లి(నర్సాపూర్): రైతులు కష్టపడి పండించిన ధాన్యం దళారులకు విక్రయించొద్దని, ప్రతీ ధాన్యం గింజను కొంటామని మహ్మద్‌నగర్ పీఏసీఎస్ సీఈఓ దుర్గాగౌడ్ తెలిపారు. ఆదివారం 'సాక్షి' దినపత్రికలో ధాన్యం దళారుల పాలు అనే ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీంతో జిల్లా అధికారులు స్పందించారు. అధికారుల సూచన మేరకు మండలంలోని మహ్మద్‌నగర్ సొసైటీ సీఈఓ దుర్గాగౌడ్ మహ్మద్‌నగర్ గేట్‌తండాకు వెళ్లి రైతులతో మాట్లాడారు. రైతులు కొనుగోలు కేంద్రం వద్దకు ధాన్యం తీసుకు రాలేదని చెప్పారు. రైతులు దళారులకు ధాన్యం విక్రయించొద్దని, ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేస్తామన్నారు. ఎండ తీవ్రతతో హమాలీల సమస్యతో పాటు రైస్‌మిల్ వద్ద లారీల్లో లోడ్ ఖాళీకాక సమస్య ఉందని చెప్పారు. సమస్యను పరిష్కరించి రైతులకు అండగా ఉంటామని చెప్పారు.

సంక్షిప్త వార్తలు

◆ **బీజేపీని ఓడించాలి**

శివ్వంపేట(నర్సాపూర్): రాజ్యాంగాన్ని మారుస్తామని చెప్పిన బీజేపీని ఓడించాలని జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కల్లూరి సంజీవ అన్నారు. ఆదివారం శివ్వంపేటలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ 400 ఎంపీ స్థానాలు గెలిస్తే రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర చేస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శివ, జిల్లా ఉపాధ్యక్షుడు ఆనంద్, నాయకులు బాలేష్, యాదగిరి, రాజు చంద్రయ్య ఉన్నారు.

◆ **యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్‌గా రమేశ్**

కౌడిపల్లి(నర్సాపూర్): యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా మెదక్ జిల్లా కోఆర్డినేటర్‌గా మండలంలోని కొట్టాల గ్రామానికి చెందిన కొండపురం రమేశ్ నియామకమయ్యారు. ఆదివారం నర్సాపూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ నియామక పత్రం అందజేసినట్లు చెప్పారు.

◆ **కాంగ్రెస్‌లో చేరికలు**

చేగుంట(తూప్రాన్): మండలంలోని మక్కరాజీపేట గ్రామంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై పలువురు బీఆర్ఎస్ నాయకులు పార్టీలో చేరినట్లు తెలిపారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు శ్రీనివాస్, యాదిరెడ్డి, బాలనర్సయ్య, చంద్రయ్య, వెంకట్, మొగులయ్య, లింగం, స్వామి, రఘుపతి, పోచయ్య తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్, మండలాధ్యక్షుడు నవీన్, కొండల్‌రెడ్డి, రాజాగౌడ్, భాస్కర్, సొసైటీ చైర్మన్ పరమేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అడవికి అంటుకున్న నిప్పు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ఎస్.కొండాపూర్ అటవీ ప్రాంతంలో రిజర్వు ఫారెస్ట్‌లో నిప్పంటుకొని మంటలు ఎగిసిపడ్డాయి. ఆదివారం మధ్యాహ్నం మెదక్ – చేగుంట ప్రధాన రహదారికి ఆనుకొని మంటలు మొదలై అటవీప్రాంతాన్ని చుట్టిముట్టాయి. వేసవిలో రాలిన ఆకులతో ఒక్కసారిగా దహనం వ్యాపించి చీకటి పడే వరకు మంటలు కొనసాగాయి.



ఎగిసిపడుతున్న మంటలు

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని నాయిని జలాల్‌పూర్ వద్ద ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదివారం తెల్లవారుజామున టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. కొంగుడు గ్రామ శివారులోని హల్దీ వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారంతో టాస్క్ ఫోర్స్ సీఐ తిరుమలేశ్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. దీంతో జలాల్‌పూర్ వద్ద రహదారిపై నుంచి వస్తున్న ఇసుక ట్రాక్టర్లు కట్టుబడ్డాయి. పట్టుబడిన ట్రాక్టర్లను కొల్చారం పోలీసులకు అప్పగించారు. ఎస్ఐ మహమ్మద్ గౌస్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపిన టాస్క్ ఫోర్స్ పోలీసులు శనివారం తుక్కాపూర్ వద్ద ఐదు ట్రాక్టర్లు పట్టుకొని కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

భక్తిశ్రద్ధలతో మల్లికార్జున స్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలో భ్రమరాంబ మల్లికార్జునస్వామి కల్యాణం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆలయ 30వ వార్షికోత్సవాల్లో భాగంగా అర్చకులు ఉమాశంకరశర్మ, రవిప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో భ్రమరాంబ మల్లికార్జునస్వామి కల్యాణం నిర్వహించారు. దీంతో పాటు లక్ష్మీగణపతి పూజ, మంటప ఆరాధన, ఏకాదశ రుద్రాభిషేకం, గురుపాదుకార్చన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద అన్నదానం చేశారు. వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం



పార్టీలో చేరిన వారితో కాంగ్రెస్ నాయకులు



కల్వకుంటలో ప్రచారం చేస్తున్న నేతలు

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ఆదివారం పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు కల్వకుంట పీఏసీఎస్ మాజీ చైర్మన్ మధుసుధన్‌రెడ్డి ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో కల్వకుంట పీఏసీఎస్ డైరెక్టర్ మహేందర్ రెడ్డి, మలేశం పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

నర్సాపూర్: నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి సమక్షంలో రాంచంద్రాపూర్, చిన్నచింతకుంట, సీతారాంపూర్, రాయిలాపూర్ గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తండాలో కాంగ్రెస్ ప్రచారం

శివ్వంపేట(నర్సాపూర్): గిరిజన తండాలో కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బిక్య పంచాయతీ పరిధిలోని తండాల్లో కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు తిరుపతి రాథోడ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. చేతి గుర్తుకు ఓటేసి నీలం మధుని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

సురేష్ షెట్కార్‌ను గెలిపించాలి

పెద్దశంకరంపేట(మెదక్): జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ మండల కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఇంటింటి ప్రచారం చేశారు. చేతి గుర్తుకే ఓటేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

నీలం మధును గెలిపించాలి

కౌడిపల్లి(నర్సాపూర్): మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధును భారీ మెజార్టీతో గెలిపించాలని మదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని దేవులపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలతో ప్రజలకు ప్రభుత్వ పథకాలు అమలు చేస్తుందని చెప్పారు. మరింత అభివృద్ధి కోసం కాంగ్రెస్‌ను గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు సతీష్, నాయకులు నర్సింహారెడ్డి, సత్యాగౌడ్, రాములు, చిలుముల నర్సింహారెడ్డి, శివాంజనేయులు, దుర్గాగౌడ్, మల్లేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో భక్తుల పూజలు



కౌడిపల్లి(నర్సాపూర్): నల్లపోచమ్మను దర్శించుకుంటున్న భక్తులు



చాముండేశ్వరి ఆలయంలో అమ్మవార్లను దర్శించుకుంటున్న భక్తులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తుల అమ్మవార్లను దర్శించుకొని, మొక్కులు సమర్పించుకున్నారని ఆలయ అర్చకులు తెలిపారు. ఆదివారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమ్మవారికి ప్రీతికరమైన ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు.

నల్లపోచమ్మదేవి ఆలయంలో ..

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మదేవి ఆలయంలో ఆదివారం భక్తులతో రద్దీ నెలకొంది. ఈఓ మోహన్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు శివ్వప్ప, రాజేశ్ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం చేసి భక్తులకు దర్శనం కల్పించారు.